క్లుప్తంగా

విద్యాకానుక కిట్లు పంపిణీ



గుత్తావారిపాలెం(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గుత్తావారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. విద్యకు జగనన్న ప్రభుత్వం పెద్ద పీటం వేసిందని ఆమె చెప్పారు. హెచ్ఎం పి.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రేపల్లె పట్టణ సీఐగా నజీర్‌బేగ్



రేపల్లె: రేపల్లె పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా ఎం.నజీర్‌బేగ్ శుక్రవారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సీఐడీలో విధులు నిర్వహిస్తూ.. సాధారణ బదిలీపై ఆయన రేపల్లె విచ్చేశారు. రేపల్లె సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయచంద్ర వీఆర్‌కు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నజీర్ బేగ్‌కు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పుష్ప గుచ్చాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

18న సైన్స్, హేతువాదం అంశంపై సమావేశం



బాపట్ల: సమాజం చైతన్యవంతంతో అభివృద్ధి పథంలో సాగాలంటే హేతువాద భావాలు కలగాలని బాపట్ల జిల్లా హేతువాద సంఘం అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు పేర్కొన్నారు. సైన్సు–హేతువాదం అనే అంశంపై ఈ నెల 18న స్థానిక ఎన్జీఓ హోంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వివిధ అంశాలపై సమావేశంలో చర్చించటం జరుగుతుందని తెలిపారు. హేతువాద భావాలు కలిగిన వారు పాల్గొనాలని కోరారు. సమావేశానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. నాగ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పం విజయవంతం చేయాలి



పిట్టలవానిపాలెం: గ్రామ పంచాయతీలో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిట్టలవానిపాలెం ఎంపీడీఓ మారుతీ శేషమాంబ కోరారు. మండల పరిధిలోని అలకాపురం గ్రామ సచివాలయాన్ని, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. సచివాలయం రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయం సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంతో గ్రామాన్ని పరిశుభ్రం చేసి, చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు తరలించి ప్రాసెసింగ్ చేయాలన్నారు. గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, ఈవోపీఆర్డీ పద్మజ, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

లఘు చిత్రం 'నిర్ణయం' క్లైమాక్స్‌చిత్రీకరణ

తెనాలి: మధ్యతరగతి మనిషి ఎదుర్కొనే సమస్యలు ఇతివృత్తంగా తీస్తున్న లఘుచిత్రం 'నిర్ణయం' అని దర్శకుడు సాయి లక్కరాజు వెల్లడించారు. స్వరలయ ప్రొడక్షన్స్ బ్యానర్‌తో నిర్మిస్తున్న ఈ లఘుచిత్రాన్ని సాయి లక్కరాజు రచించి, దర్శకత్వ వహిస్తున్నారు. స్థానిక వహాబ్‌రోడ్‌లో శుక్రవారం క్లైమాక్స్ దృశ్యాలను చిత్రీకరించారు. కథ ప్రధానంగా తీస్తున్న తన లఘుచిత్రాలు విస్తృత ఆదరణ పొందాయనీ, ఈ నెలాఖరులో అంతర్జాలంలో స్వరలయ స్టూడియోస్ ద్వారా విడుదలయే 'నిర్ణయం'ను కూడా ఆదరించాలని కోరారు. ఇందులో స్థానిక కళాకారులు, విజయవాడ నటీమణులు నటించినట్టు తెలిపారు. కుటుంబసమేతంగా చూడగల అంశాలతో లఘుచిత్రాలను చిత్రీకరిస్తున్న సాయి లక్కరాజు అభినందనీయులని స్వరలయ సభ్యుడు, జీడీసీసీబీ విశ్రాంత సీఈఓ డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోండి

తెనాలిఅర్బన్: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సాలీపేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ దివి కిషోర్ కుమార్ సూచించారు. మాలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాలీపేటలో మాలేరియాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వలన మాలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వంటి వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సహాయ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకంత్, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న మార్ట్.. వెరీ స్మార్ట్

- వ్యాపార రంగంలోకి డ్వాక్రా సంఘాల సభ్యులు
- జగనన్న మార్టుల ద్వారా ఆర్థిక చేయూత
- జిల్లాలో ఇప్పటికే మూడు చోట్ల ఏర్పాటు
- రూ.కోటికిపైగా పెట్టుబడితో లాభాల బాట
- మరో నాలుగు ఏర్పాటుకు ప్రతిపాదనలు



మార్ట్‌లో వస్తువులు కొనుగోలు చేసి బిల్లులు చెల్లిస్తున్న వినియోగదారులు

బాపట్ల అర్బన్: డ్వాక్రా సంఘాల సభ్యులకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక విధాలుగా ఆర్థిక అండనిస్తోంది. మహిళలను వ్యాపార రంగంలోకి తీసుకొచ్చి వారికి శాశ్వత ఉపాధి కల్పిస్తోంది. జగనన్న మార్ట్‌లను డ్వాక్రా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేయించి.. వారి ఆర్థిక ప్రగతికి బంగారు బాటలు వేస్తోంది. జిల్లాలో ఇప్పటికే రేపల్లె, నిజాంపట్నం, అద్దంకి పట్టణాల్లో జగనన్న మార్టులు ఏర్పాటు చేశారు. తాజాగా చీరాలలో మరో మార్టు ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మరో వైపు జిల్లాలోని ఇంకొల్లు, పర్చూరు, మార్టూరు... పట్టణాల్లో మార్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు.

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నారు. డ్వాక్రా సంఘాల ఆర్థిక అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నారు. మహిళలకు వైఎస్సార్ చేయూత వంటి అనేక పథకాలతో వారి జీవన ప్రమాణాల్లో మార్పుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జగనన్న మార్ట్‌లు ఏర్పాటు చేసి.. వ్యాపార రంగంలో మహరాణులుగా తీర్చిదిద్దుతున్నారు. ఇలా డ్వాక్రా మహిళల ఆర్థిక చేయూతకు పట్టం కడుతున్నారు.

మార్టుల్లో స్మార్ట్ వర్క్

బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలంలో 28 గ్రామాలకు సంబంధించి 501 గ్రామ సమైక్య సంఘాలు ఉన్నాయి. ఇందులో 1488 గ్రూపులకుగాను 1492 మంది సభ్యులు ఉన్నారు. వీరు మూలధనం వాటా రూ.300 చెల్లించి సభ్యులుగా చేరారు. దీని ద్వారా జగనన్న మహిళా మార్టు ఏర్పాటు చేసుకున్నారు. ఈ మార్టులో ఉద్యోగులుగా డ్వాక్రా గ్రూపుల్లో చదువుకున్న సభ్యులకే అవకాశం కల్పించారు. తద్వారా వారికి ఉపాధి చూపించారు. మెప్మా సంస్థ ఆధ్వర్యంలో జగనన్న మార్టుల నిర్వహణపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. వ్యాపారాల్లో మెళకువలు, లాభాలు గడించే విధానం, నాణ్యమైన ఉత్పత్తుల తయారీ, ప్రజల నమ్మకాన్ని చూరగొనడం, ఎలాంటి ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తుంది. అనే అంశాలపై సమగ్ర శిక్షణ అందించడంతో.. ఆయా మార్టుల్లో పని చేసే సిబ్బంది నైపుణ్యతను చూపుతున్నారు. తద్వారా మార్టులో ప్రతి రోజూ రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వ్యాపారం జరుగుతుంది. రేపల్లెలో 1643 సంఘాలకుగాను 1657 మంది గ్రూప్ సభ్యులు ఉన్నారు. వీరు మొదట రూ.300 చెల్లించి వ్యాపారాన్ని ప్రారంభించారు. ఇక్కడ కూడా రూ.50 వేల వరకు వ్యాపారం సాగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతోపాటు మార్టుల నిర్వహణ ద్వారా వచ్చిన డివిడెంట్‌లో ప్రతి ఏటా 33 శాతం అందరూ సమానంగా పంచుకుంటారు.

మన దుకాణంలోనే మన ఇంటి సామగ్రి

డ్వాక్రా సంఘాల్లో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల సభ్యులే అధికంగా ఉంటారు. వీరు ప్రతి నెలా ఇంటి సరుకులకు రూ.5 వేల నుంచి రూ. 7 వేల వరకు వెచ్చిస్తుంటారు. వీటిని ఇతర చిల్లర దుకాణాల్లో కొనుగోలు చేస్తుంటారు. గ్రూపు సంఘాల సభ్యుల ద్వారా నెలకొల్పిన జగనన్న మార్టుల్లో ఆయా సరుకులు కొనుగోలు చేస్తే .. సాధారణ దుకాణాల్లో కంటే 50 శాతం డిస్కౌంట్ అందిస్తున్నారు. తద్వారా ప్రతి నెలా రూ.వెయ్యి వరకు ఆదా అవుతుంది. ఇది పేద కుటుంబాలకు పెద్ద మొత్తమే. మరో వైపు నాణ్యమైన, నమ్మకమైన ఉత్పత్తులు అందిస్తున్నారు.

జిల్లాలో మరో నాలుగు మార్టులకు ప్రతిపాదనలు

జిల్లాలో ఇప్పటికే అద్దంకి, నిజాంపట్నం, రేపల్లె పట్టణాల్లో జగనన్న మార్టులు ఏర్పాటు చేశారు. ఇవి లాభాల బాటలో నడుస్తున్నాయి. తాజాగా చీరాల పట్టణంలో నూతనంగా మరో జగనన్న మార్ట్ సిద్ధం చేశారు. త్వరలో ఈ మార్ట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. మరో వైపు జిల్లా వ్యాప్తంగా ఇంకొల్లు, మేదరమెట్ల మార్టూరు, పర్చూరులో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని మెప్మా అధికారులు చెప్పారు. డ్వాక్రా సంఘాల మహిళలకు కోసం జగనన్న తీసుకుంటున్న చర్యలతో తమ ఆర్థిక పురోగతి బాగుందని, వచ్చే ప్రతి రూపాయి తమ కుటుంబానికి ఆసరాగా మారిందని ఆయా సంఘాల్లో సభ్యులు ఆనందంగా చెబుతున్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

ఆర్డీఓ పార్థసారథి



లేఅవుట్‌లో అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పార్థసారథి

వేమూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను రేపల్లె ఆర్డీఓ పార్థసారథి ఆదేశించారు. మండల కేంద్రంలోని జగనన్న లే అవుట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం లే అవుట్‌లో పేదలకు 750 ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 50 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. వేమూరు నియోజకవర్గం గృహ నిర్మాణాల్లో వెనుకబడినట్లు చెప్పారు. లబ్ధిదారులను వేగవంతం చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండి.. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రామణ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస రావు, సజ్జా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేనేతల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న చంద్రబాబు

– ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

భట్టిప్రోలు: రాష్ట్రంలో చేనేతల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేనేతలను ఉద్ధరిస్తామని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. శుక్రవారం ఆయన భట్టిప్రోలు మెయిన్ సొసైటీకి విచ్చేశారు. ఈ సందర్భంగా సొసైటీలోని వస్త్రాలను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. వస్త్ర నిల్వలను గురించి ఆరా తీశారు. ఉత్తర కుమారుడిగా పాదయాత్ర చేస్తున్న లోకేష్, మరోవైపు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబునాయుడు చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఎలక్షన్ స్టంట్‌లో భాగంగా చేనేత కార్మికులకు కల్లబొల్లి కబుర్లు చెబుతూ.. ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. చేనేత పరిశ్రమ దుస్థితికి కారణం చంద్రబాబేనని విమర్శించారు. రాష్ట్రంలోని చేనేతలను దత్తత తీసుకుంటామని లోకేష్ చేసిన ప్రకటనపై చేనేత సంఘీయులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దత్తత తీసుకోవడం అనే మాట సరైనది కాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. నాలుగు కార్పొరేషన్ చైర్మన్‌లు, 48 మంది డైరెక్టర్ల పదవులకు పద్మశాలీయులకు కేటాయించారని పేర్కొన్నారు. ఇకనైనా చంద్రబాబునాయుడు, లోకేష్‌లు అబద్ధ ప్రచారాలను మానుకోవాలని కోరారు. ఐలవరానికి చెందిన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ జొన్నాదుల నాగరాజు తండ్రి వెంకటేశ్వరరావు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను చిరంజీవి పరామర్శించారు. ఆయన వెంట భట్టిప్రోలు, కనగాల సొసైటీల అధ్యక్షులు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, రాచాబత్తుని లక్ష్మి నరసింహరావు, సొసైటీ మేనేజర్ బట్టు కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మదరసా నిర్మాణంపై రాద్ధాంతం తగదు



మదరసా నిర్మాణ స్థలంలో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

భట్టిప్రోలు: దద్దేపల్లిలో మదరసా నిర్మాణంపై అనవసర రాద్ధాంతం వద్దని ముస్లిం పెద్దలు కోరారు. తమ సొంత నిధులతో భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో అబ్దుల్ కలందర్ కుటుంబీకుల స్థలంలో మదరసా నిర్మాణం ప్రారంభిస్తే.. కొంతమంది ఆ స్థలం పీఏసీఎస్ సొసైటీకి చెందినదని వివాదం సృష్టించడం బాధాకరమన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. సొసైటీకి మూడు సెంట్లు స్థలం కేటాయిస్తామని ఆ కుటుంబం స్పష్టం చేసినప్పటికీ.. కొంతమంది మదరసా నిర్మాణం చేపట్టకూడదని రాద్ధాంతం చేయడం తగదన్నారు. తరాలుగా ఈ స్థలం అబ్దుల్ కలందర్ కుటుంబీకులదేనన్న.. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ఉన్నా.. తప్పుడు కథనాలతో బురద జల్లడం సిగ్గుచేటన్నారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా మదరసా నిర్మాణం చేసి తీరతామని స్పష్టం చేశారు. అద్దేపల్లి మసీదు వద్ద ఉన్న ప్రభుత్వ రెవెన్యూ ×కచేరి₹ ఆక్రమించి అద్దె వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీం, వార్డు సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్, జిల్లా వక్ఫ్ బోర్డ్ సెక్రటరీ సయ్యద్ నబీ, తబ్రేజ్, జుబేర్, కుతుబుద్దీన్, సయ్యద్ బాజాన్, అల్లాభక్షు, షేక్ మొహుద్దీన్, మున్వర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.మూడు లక్షల వ్యయంతో కల్వర్టులు నిర్మిస్తాం

చైర్‌పర్సన్ ఖలేదా నసీం



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీం

తెనాలిఅర్బన్: చినరావూరు పార్కు పక్కనే ఉన్న రావిచెట్టు నుంచి రైల్వేగేటుకు వెళ్ళే వైజంక్షన్ ప్రాంతంలో రూ.మూడు లక్షలతో కల్వర్టు త్వరలో నిర్మిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం ప్రకటించారు. దానికి సంబంధించిన టెండర్లు కూడా పూర్తి అయ్యాయని, పనులు ప్రారంభించడమే ఆలస్యమన్నారు. శుక్రవారం 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాతతో కలిసి ఆమె ఆ ప్రాంతంలో పర్యటించారు. చిన్నపాటి వర్షానికి కూడా నీటితో నిండిపోతుందని కౌన్సిలర్ తెలియజేశారు. రోడ్డు ఎత్తు పెంచడంతో పాటు కల్వర్టులు నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఏఈ చైతన్య, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను, పిల్లి వీరయ్య, పఠాన్ షరీఫా, చంద్రశేఖర్, అక్కల రమేష్, ఉగం సాంబయ్య, తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



సాయమందిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున



సహాయం అందజేసిన ముస్లిం మత పెద్దలు

పెరవలి(వేమూరు): అగ్ని ప్రమాదం బాధితులను ప్రభుత్వం అదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. పెరవలి గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధితులు బొర్రా రవి, బొర్రా పార్వతమ్మ కుటుంబాలకు శుక్రవారం ఆయన ఆర్థిక సాయం అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ అధ్వర్యంలో అగ్ని ప్రమాదం బాధితులకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం అదుకుంటుందని, ఇళ్లు కూడా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాది వెంకట లక్ష్మీరాజ్యం, దాది సుబ్బారావు, బొల్లి ముంత ఏడుకొండలు, దున్నా మేరీసుబాబు, మాజీ సర్పంచ్ దాసరి పోతురాజు, మాజీ ఎంపీటీసీ దాసరి మోహనరావు, పట్టెల రంగబాబు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టరు వీర రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మత పెద్దల సాయం..

కర్లపాలెం: కర్లపాలెం పీహెచ్‌సీ సమీపంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో పూరిల్లు, పశువుల పాక దగ్ధమై నిరాశ్రయులైన కాటూరి చిననారాయణ కుటుంబానికి శుక్రవారం ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో, ముస్లిం పెద్దల సహకారంతో 10 కేజీ బియ్యం, రూ.5వేల నగదును మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్ అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ ఇబ్రహీం, షేక్ జిలానీ, షేక్ హబీబ్, పఠాన్ కరిముల్లా ఖాన్, షేక్ సాబీర్ తదితరులు ఉన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి మానుకు పూజలు



దమ్మనవారిపాలెం(కర్లపాలెం): గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి మానుకు మహిళలు శుక్రవారం పసుపు కుంకుమలతో పూజలు చేశారు. దమ్మనవారిపాలెం గ్రామదేవత నాంచారమ్మ తల్లి వార్షిక కొలుపులు ఈ నెల 21 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. మహాలక్ష్మి అమ్మవారి మానుకు హారతులిచ్చి మహిళలు టెంకాయలు కొట్టారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: వ్యభిచార గృహంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి నవ్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్, ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావుకు వచ్చిన సమాచారంతో పట్టణ నాజరుపేటలోని ఓ ఇంటిపై శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తాడేపల్లికి చెందిన వ్యభిచార నిర్వాహకుడు షేక్ గఫూర్‌ను అదుపులోకి తీసుకుని ఇద్దరు మహిళలను కాపాడారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

త్రీ టౌన్ సీఐ బాధ్యతల స్వీకారం



సీఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: తెనాలి త్రీ టౌన్ సీఐగా నియమితులైన ఎస్. రమేష్ బాబు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రేంజ్ పరిధిలో జరిగిన బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా వినుకొండ సీఐగా పనిచేస్తున్న రమేష్ బాబు తెనాలి త్రీ టౌన్‌కు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన యు శ్రీనివాసులు బదిలీ అయ్యారు. 1998వ బ్యాచ్‌కు చెందిన సీఐ రమేష్ బాబు స్వస్థలం ప్రకాశం జిల్లా కాగా ఆ జిల్లాలోని పలు స్టేషన్లలో ఆయన పని చేశారు. 1998లో మొదటిగా రిజర్వ్ ఎస్ఐగా సెలక్టయ్యారు. 2011లో కన్వర్షన్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాచర్ల, దాచేపల్లి, కారంపూడి, యడ్లపాడు స్టేషన్‌లలో ఎస్ఐగా పని చేశారు. అనంతరం పదోన్నతి పొంది సిబిడి విభాగంలో నాలుగు ఏళ్ల సీఐ హోదాలో పని చేశారు. సిబిడి నుండి వినుకొండకు బదిలీపై వచ్చి అక్కడ రెండేళ్లపాటు సేవలందించారు. తాజా బదిలీల్లో భాగంగా తెనాలి త్రీ టౌన్ సీఐగా నియమితులయ్యారు. తెనాలి త్రీ టౌన్ కు బదిలీపై వచ్చిన రమేష్ బాబుకు ఎస్సైలు విజయ్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్, స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అందరి సహకారంతో త్రీ టౌన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన సీఐ తెలియజేశారు.

తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ప్రసూనారెడ్డి



ప్రసూనారెడ్డి

తెనాలి: తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ప్రసూనారెడ్డి బాధ్యతల్లోకి వచ్చారు. ఆయన స్వస్థలం రాజమహేంద్రవరం. ప్రస్తుతం తమిళనాడు సర్కిల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని తపాలశాఖ ప్రజలకు అనేక రకాలైన పథకాలను అందిస్తోందని, వాటిని మారుమూల ప్రజానీకానికి సైతం చేరువ చేయాలన్నదే తన లక్ష్యంగా చెప్పారు. ప్రముఖులకు తక్కువ ఖర్చుతో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకునేందుకు వీలుగా 'ఈ–పోస్ట్...సర్వీసు అమలులో ఉందన్నారు. ఈనెల 20వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమెకు కేవలం రూ.10లతో ఈ–పోస్ట్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయవచ్చని చెప్పారు. తెనాలి డివిజనులోని ప్రతి పోస్టాఫీసులోనూ ఈ సౌకర్యం ఉందని, అభిమానులు, ఆసక్తి గలవారు వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు.

తపాల జీవితబీమా/ గ్రామీణ తపాల జీవితబీమా పాలసీలను కొందరు రెన్యూవల్ చేయడం లేదన్న భావనతో పునరుద్ధరణకు తపాలశాఖ అవకాశం కల్పించిందని చెప్పారు. ఈనెల ఒకటో తేదీనుంచి జులై 31వ తేదీవరకు ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుందని, పునరుద్ధరణకు చెల్లించాల్సిన డిఫాల్ట్ ఫీజులో రూ.లక్ష నుండి రూ.3 లక్షల వరకు 25 శాతం అంటే రూ.3000 వరకు, రూ.3 లక్షలు ఆపైన 30 శాతం రాయితీ అంటే రూ.3500 వరకు తగ్గింపు ఉంటుందని వివరించారు.

మహిళల కోసం సరికొత్త డిపాజిట్ పథకం...

తపాలశాఖ ప్రత్యేకించి మహిళల కోసం 'మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్'ను ఇటీవలే ప్రవేశపెట్టిందని ప్రసూనారెడ్డి తెలిపారు. మహిళా సాధికారత కోసం కేవలం మహిళలకే ఉద్దేశించిన ఈ పథకంలో మహిళలు ఎవరైనా రూ.2 లక్షలు డిపాజిట్ చేస్తే, రూ.7.5 శాతం వడ్డీతో రెండేళ్లకు రూ.36 వేలకు పైగా అదనంగా వస్తుందని, డిపాజిట్‌పై 40 శాతం లోను రూపంలో తీసుకోవచ్చనీ వివరించారు. మొదట రూ.1000తో డిపాజిట్ ఆరంభించి, మూడునెలల్లో రూ.2 లక్షల డిపాజిట్‌ను పూర్తిచేసుకునే వెసులుబాటును కల్పించిందని చెప్పారు. విదేశాలకు వివిధ రకాల పార్శిళ్లను పంపుకునే వారికోసం 'డాక్ నిర్యాత్ కేంద్ర...ను బాపట్ల ప్రధాన పోస్టాఫీసులో ఏర్పాటు చేశామన్నారు. విదేశాలకు పంపాల్సిన వస్తువులను తీసుకెళితే, అక్కడి సహాయకులు ప్యాకింగ్ చేసి బుక్ చేస్తారని వివరించారు. ప్రజలు తపాలశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య సేవలు సవ్యంగా అందేలా జాగ్రత్తలు పాటించాలి

కొల్లూరు: గర్భిణులు, బాలింతల వివరాలు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేసుకోవడంతో పాటు, వారికి సవ్యంగా వైద్య సేవలు అందేలా వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంగా వ్యవహరించాలని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్.సుష్మ సుశాన్, ఐసీడీఎస్ అమృతలూరు ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి నిర్దేశించారు. శుక్రవారం కొల్లూరు పీహెచ్‌సీలో కొల్లూరు, అనంతవరం సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత సమస్యను నివారించడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. అవగాహన కార్యక్రమాల ద్వారా రక్తహీనతను అధిగమించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. పౌష్టికాహార విషయంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడటంతోపాటు, వైద్య, ఆరోగ్య సిబ్బంది నిర్దేశించిన సమయంలో తప్పనిసరిగా గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సాయం అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు విజయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

మూగజీవాల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

రేపల్లె రూరల్: ప్రస్తుత వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, మూగజీవాల దప్పికను తీర్చటం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తహసీల్దారు డి.మల్లికార్జునరావు కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ గృహాల ముందు మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి సదుపాయాన్ని కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దారు కార్యాలయం నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

అల్లుడు అప్పు తీర్చలేదని అత్తామామలు దాడి

జంపని(వేమూరు): అల్లుడు అప్పు తీర్చలేదని అత్తామామలు మరికొందరితో కలిసి అతని తల్లిదండ్రులపై దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ కుమారస్వామి వివరాల మేరకు.. జంపని గ్రామానికి చెందిన కళ్లె కోటేశ్వరరావు కుమారుడు గాంధీకి కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన మేడం సుశీలను ఇచ్చి వివాహం చేశారు. గాంధీ తన అత్తమామల వద్ద రెండేళ్ల క్రితం లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. అతను అప్పు తీర్చకపోవడంతో.. అత్తోట గ్రామానికి చెందిన మరికొందరితో కలిసి అత్తమామలు జంపని గ్రామంలోని గాంధీ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో తాను ఇంటి దగ్గర లేకపోవడంతో.. తన తండ్రి కోటేశ్వరరావును అత్తమామలు, వారితో వచ్చిన వారు కర్రలతో దాడి చేశారని స్థానిక పోలీసుస్టేషన్‌లో గాంధీ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బహిరంగ ప్రకటన

[illegible]

గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, కొనకాల ప్రసాద్, పి.మాధవి
న్యాయవాదులు, రేపల్లె